పురుగు మందుల పిచికారీ... ప్రాణాంతకం

- వినియోగంలో జాగరూకతతో వ్యవహరించాలి
- రైతులు, కూలీలు అప్రమత్తం కాకుంటే ప్రాణాలకే ముప్పు


వరి పైరుపై పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు

పెదవేగి : క్రిమి సంహారక మందుల వాడకంలో రైతులు సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే అనారోగ్య సమస్యల బారిన పడాల్సి వస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఒక్కోసారి మరణాలు కూడా సంభవిస్తాయని చెబుతున్నారు. ఇలాంటి తరుణంలో పంటల్లో ఎరువులు, మందులు పిచికారీ చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డివిజనల్ వ్యవసాయ సహాయ సంచాలకులు సుబ్బారావు పలు జాగ్రత్తలు వివరించారు.

రసాయనాలతో అనారోగ్య సమస్యలు

పంటలను ఆశించే చీడపీడల నివారణ కోసం రైతులు క్రిమి సంహారక మందులు వేస్తుంటారు. ఇలాంటి తరుణంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు. పరోక్షంగా ఇతర ఆరోగ్య సమస్యలకు కారణమవుతుంది. క్యాన్సర్, గుండె జబ్బులు, కళ్లు తిరగడం, వాంతులు, కాలేయం, పెరుగుదల, నరాల బలహీనత వంటి వాటికి లోనయ్యే ప్రమాదముంది. పిచికారీ చేసే వ్యక్తులకే కాకుండా మందుల వాడకం వల్ల వాటి అవశేషాలు పంటలపై చాలా కాలంగా ఉండి వాటిని వినియోగించే ప్రతి ఒక్కరూ అనారోగ్యానికి లోనవుతున్నారు.

సేంద్రియ సాగు విధానం మేలు

సేంద్రియ సాగు, విధానాన్ని అనుసరించడం వల్ల నేల ఆరోగ్యంగా ఉంటుంది. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు, ఆరోగ్యకర పంట ఉత్పత్తులు పొందవచ్చు. పాలేకర్ ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేయడం వల్ల పెట్టుబడి వ్యయం సగానికి పైగా తగ్గుతుంది. పశువుల వ్యర్థాలు, వేపాకు కషాయం, పచ్చిరొట్ట ఎరువులు, వర్మీకంపోస్టు వంటివి వినియోగించడం ద్వారా భూసారం పెరుగుతుంది. విచక్షణా రహితంగా పురుగు మందులు వినియోగించడం వల్ల కీటకాలు వాధి నిరోధక శక్తిని పొందుతాయి. దీనివల్ల పంటకు మరింత నష్టం చేకూరుతుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- మందులు పిచికారీ చేసే సమయంలో శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంటే దుస్తులు ధరించాలి.
- ముఖానికి మాస్క్, చేతులకు గ్లౌజ్‌లు ధరించాలి.
- పిచికారీ చేసే సమయంలో పొగ, నీరు తాగడం, భోజనం చేయరాదు.
- పిచికారీ మందు కోసం వాడే స్ప్రేయర్లు కండీషన్‌లో ఉన్నాయో లేదో ముందుగా చూసుకోవాలి.
- పురుగు, తెగుళ్ల మందులను చేతులతో కాకుండా కర్రతో కలపాలి.
- ఆహార పదార్థాలతో పాటు కీటక నాశక మందులను రవాణా చేయరాదు.
- పురుగు మందుల డబ్బాలను పిల్లలకు అందకుండా వాటిని కేటాయించిన గదిలో భద్రపరిచి తాళం వేయాలి.
- పురుగు మందులు వినియోగించే ముందు వాటిపై వివరాలను బాగా పరిశీలించాలి. డబ్బాలపై రంగు ముద్రలను కూడా పరిశీలించాలి.
- గాలి వీచే దశలోనే మందు పిచికారీ చేయాలి.
- నాజిల్స్‌ను శుభ్రపరచడానికి నోటితో గాలిని ఊదరాదు.
- ప్రమాదవశాత్తూ మందు కళ్లలో పడితే వెంటనే మంచినీటితో శుభ్రం చేసుకోవాలి.
- కీటక నాశక మందుల డబ్బాలను ఖాళీ అయిన వెంటనే గొయ్యితీసి అందులో పూడ్చిపెట్టాలి. వాటిని ఇతర అవసరాలకు వాడరాదు.
- పిచికారీ పూర్తయిన వెంటనే స్నానం చేసి దుస్తులను శుభ్రపరచుకోవాలి.
- ప్రమాదవశాత్తు విష ప్రభావానికి గురైతే ప్రథమ చికిత్స అందించి, డాక్టర్లను సంప్రదించాలి. పురుగు మందుల వివరాలను డాక్టర్‌కు తెలపాలి.
- పిచికారీ పూర్తయిన అనంతరం స్ప్రేయర్ల ట్యాంక్ బయట, లోపల శుభ్రంగా కడిగి వాటి భాగాలకు ఇంజన్ ఆయిల్ పట్టించి జాగ్రత్త పరచాలి.

అప్రమత్తంగా ఉండాలి



పంటలకు కావాల్సినంత నీరు అందకపోతే చీడ పీడలు ఎక్కువగా వ్యాపించే అవకాశం ఉంది. తొలి దశలోనే తెగుళ్లను గుర్తించి నివారణ చర్యలు తీసుకోవాలి. లేనిపక్షంలో పంటలు పూర్తిగా దెబ్బతినే ప్రమాదముంది.

– సుబ్బారావు, డివిజనల్ వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు, ఏలూరు

దమ్ము ట్రాక్టర్లతో రహదారులు ఛిద్రం

- నిబంధనలు పాటించని ట్రాక్టర్ల యజమానులు
- పట్టించుకోని అధికారులు


రోడ్డుపై దమ్ము చక్రాలతో వెళ్తున్న ట్రాక్టర్

దెందులూరు: నియోజకవర్గంలో గ్రామీణ రహదారులు దమ్ము చక్రాల ట్రాక్టర్ల రాకపోకలతో ధ్వంసమవుతున్నాయి. ఏటా ఖరీఫ్, రబీ సాగు సమయంలో పంట దమ్ముల సమయాల్లో ట్రాక్టర్ల యజమానులు దమ్ము చక్రాలతో రోడ్లపై యథేచ్ఛగా పయనిస్తున్నా రహదారులకు సంబంధించిన ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ అధికారులు, పోలీస్ విభాగం కాని వాటిపై చర్యలు చేపట్టడం లేదు. గ్రామీణ రహదారులలో దమ్ము చక్రాల ట్రాక్టర్లను నిరోధించడంలో స్థానిక అధికారులు సైతం విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గోదావరి నది నుంచి డెల్టా కాలువలకు ఇరిగేషన్ అధికారులు నీరు విడుదల చేయడంతో పాటు ఇటీవల వర్షాలు కురుస్తుండటంతో రైతులు పొలాల్లో పంట దమ్ములు చురుగ్గా నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలోని దెందులూరు, పెదవేగి, పెదపాడు, ఏలూరు రూరల్ మండలాల్లో సుమారు 600 ట్రాక్టర్లున్నాయి. దమ్ము చేసే సమయంలో ఈ ట్రాక్టర్లకు ఇనుప చక్రాలను బిగించి పొలాల్లో దమ్ము చేస్తుంటారు. ఈ క్రమంలో ట్రాక్టరు డ్రైవర్లు, యజమానులు ఒక పొలం నుంచి మరో పొలానికి వెళ్లేందుకు ఇనుప చక్రాలతోనే ట్రాక్టర్లతో యథేచ్ఛగా రోడ్లపై తిరుగుతుండటంతో రూ.లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లు, తారు, గ్రావెల్ రోడ్లు ధ్వంసమవుతున్నాయి. ఫలితంగా కోట్లాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం అవుతోంది. ఇనుపచక్రాల దెబ్బకు రోడ్లు పగుళ్లు తీసి రాళ్లు లేచిపోవడంతో అధ్వానంగా తయారవుతున్నాయి. దమ్ము చక్రాలతో రోడ్డుపై ప్రయాణించేటప్పుడు చక్రం చుట్టూ బెల్టు (ఇనుప బద్దె) ఏర్పాటు చేసుకోవాలని ఉన్నతాధికారులు సూచిస్తున్నా ట్రాక్టర్ యజమానులు లక్ష్యపెట్టడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి దమ్ముచక్రాల ట్రాక్టర్ల బారి నుంచి గ్రామీణ రహదారులను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం



దమ్ము చక్రాలతో ట్రాక్టర్లు రోడ్డుపై ప్రయాణించేటప్పుడు బెల్టు ఏర్పాటు చేసుకోవాలి. నిబంధనలకు విరుద్ధంగా రహదారులపై దమ్ము చక్రాలతో ట్రాక్టర్లు పయనించడం మా దృష్టికి వస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటాం.

– కె.స్వామి, ఎస్సై, దెందులూరు

ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ పేరుతో మొక్కలు


పత్తేపురం జెడ్పీస్కూల్లో నాటేందుకు సిద్ధం చేసిన మొక్కలతో తల్లులు


గుండుగొలను -1 స్కూలు ప్రాంగణం వద్ద మొక్కలు నాటుతున్న విద్యార్థుల తల్లులు


పెదపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటుతున్న తల్లులు


సీతంపేట పాఠశాలలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు

నిడమర్రు: జాతీయ విద్యా విధానం అమల్లోకి వచ్చి 4 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 22 నుంచి నిర్వహిస్తున్న శిక్షా సప్తాహ్‌లో భాగంగా శనివారం మండలంలోని పాఠశాల్లో విద్యార్థులతో ఎకో క్లబ్‌లు ఏర్పాటు చేసి పర్యావరణ దినోత్సవాన్ని, పోషణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి పాఠశాలలో అమ్మపేరుతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. పత్తేపురంలో స్థానిక సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సమకూర్చిన వివిధ రకాల పండ్ల మొక్కలను విద్యార్థులు వారి తల్లుతో కలిసి నాటారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రుద్రరాజు వెంకటేశ్వరరాజు, గ్రామ పెద్దలు లక్ష్మీపతిరాజు, పేరెంట్ కమిటీ చైర్మన్ దేవి, బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణ తదితరులున్నారు.

జల్లికొమ్మరలో..

గణపవరం: జల్లికొమ్మర యూపీ స్కూల్లో తల్లుల పేరుమీదుగా విద్యార్థులు హైబ్రిడ్ కొబ్బరి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పేరెంట్ కమిటీ సభ్యులు ఉన్నారు.

హరితాంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యం

భీమడోలు: అమ్మ పేరుతో ప్రతి ఒక్కరూ మొక్కను నాటి హరితాంధ్రప్రదేశ్ సాధిందామని భీమడోలు ఎంఈవో 2 అయినపర్తి భాస్కర్‌కుమార్ అన్నారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని గుండుగొలను, పోలసానిపల్లి, పాతూరు, వడ్లపట్ల, భీమడోలులో ఉత్సాహంగా నిర్వహించారు. మండల వ్యాప్తంగా ప్రతి పాఠశాలలో శనివారం అమ్మ పేరుతో మొక్కను నాటుదాం అనే కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు తల్లులతో కలిసి వివిధ మొక్కలను నాటారు. గుండుగొలను– 1 పాఠశాలలో హెచ్ఎం పాశం పాండురంగారావు ఆధ్వర్యంలో నూతనంగా ఏకో క్లబ్‌లను ఏర్పాటు చేశారు. వడ్లపట్ల యూపీ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈవో 2 భాస్కర్‌కుమార్ సమక్షంలో మామిడి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉచితంగా యూనిఫాం అందించారు. హెచ్ఎం షాన్సీరాణి, టీచర్లు కె.భాగ్యలక్ష్మీ, డి.ఉషారాణి పాల్గొన్నారు.

జెడ్పీ ఉన్నత పాఠశాలలో శిక్షా సప్తాహ్

పెదపాడు: శిక్షా సప్తాహ్‌లో భాగంగా పెదపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం విద్యార్థులు వారి తల్లితో కలిసి వివిధ మొక్కలు నాటినట్లు ప్రధానోపాధ్యాయుడు పీ వెంకటేశ్వరరావు తెలిపారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఉపాధ్యాయులు ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు. నాయుడు గూడెం గూడెంలోని ప్రాథమిక పాఠశాలలో ఎంఈఓ డీవీ రమణ శిక్షా సప్తాహ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు మొక్కలు నాటారు.

మొక్కలు నాటిన ఉపాధ్యాయులు

దెందులూరు: స్కిల్ డెవలప్‌మెంట్ పథకం అములులో భాగంగా శనివారం సీతంపేట ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు 12 రకాల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు జీ.సునీత మాట్లాడుతూ మొక్కలు నాటిన విద్యార్థులు వాటి రక్షణ బాధ్యతను తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు తోట ఎడ్వర్డ్, జీ.రాజ్యలక్ష్మి, తులసి, జ్యోతి మాట్లాడుతూ ట్రీ గార్డులు ఏర్పాటు చేసి వారంలో రెండు, మూడుసార్లెనా నీరుపోసి మొక్కలను సంరక్షించాలని కోరారు.

మహిళల సంరక్షణకు ప్రత్యేక చట్టాలు


మొయ్యేరు పాఠశాలలో విద్యార్థుల మానవహారం

గణపవరం: మహిళల రక్షణకు ప్రభుత్వాలు ఎన్నో చట్టాలను అమలల్లోకి తీసుకువచ్చాయని, వీటిపై మహిళలు అవగాహన కల్గి ఉండాలని ఐసీడీఎస్ పిప్పర సెక్టార్ సూపర్‌వైజర్ దుర్గాభవాని అన్నారు. శనివారం గణపవరం మండలం మొయ్యేరు యూపీ పాఠశాలలో విద్యార్థినులకు మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలల హక్కులు, బాధ్యతలు, బాల్యవివాహాల నిరోధక చట్టం, పోక్సో చట్టం, బీఎన్ఎస్ యాక్టు, లింగనిర్ధారణ నిరోధక చట్టం, మహిళల రక్షణ, బాలికల విద్య, బేటీ బచావో, బేటీ పడావో పథకం తదితర విషయాలపై బాలికలకు అవగాహన కల్పించారు. మిషన్ శక్తి అనేది మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించే పథకమని, ఈ కార్యక్రమంలో ప్రతి మహిళా భాగస్వాములు కావాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మనవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు.

సీతారాములకు ప్రత్యేక అలంకరణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆషాఢ సప్తమి పర్వదినం సందర్భంగా స్థానిక రామకోటి ప్రాంగణంలోని శ్రీరామ మందిరంలోని సీతారాములను శనివారం ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్యార్చన నిర్వహించారు. అనంతరం ఆలయంలో విష్ణు సహస్రనామ పారాయణ, రామ భజనలు నిర్వహించారు. అనంతరం నగరానికి చెందిన కొట్టు మధు, తదితర భక్తుల సహకారంతో శ్రీరామునికి, సీతమ్మకు, లక్ష్మణునికి, హనుమంతునికి విశేషంగా సుమారు 100 రకాల కూరగాయలు, పండ్లు, ఆకు కూరలతో ప్రత్యేకంగా శాకాలంకరణ చేశారు. అనంతరం నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. రామకోటి విశ్వశాంతి సమాజం అధ్యక్షుడు గాదంశెట్టి రమేష్, కొట్టు మనోజ్ పాల్గొన్నారు.

ఉత్తమ సమాజ స్థాపనే మానవత లక్ష్యం


వడ్లపట్లలో నిత్యావసరాలు అందిస్తున్న దాతలు

భీమడోలు: ఉత్తమ సమాజ స్థాపనే లక్ష్యంగా మానవత సంస్థ పని చేస్తుందని జిల్లా కోఆర్డినేటర్ రామిశెట్టి గంగాధరరావు అన్నారు. అంబర్‌పేట పంచాయతీ పరిధిలోని వడ్లపట్లకు చెందిన సిద్దాబత్తుల ఓంకార్ ఇటీవల మృతి చెందాడు. నిరుపేద కుటుంబం నిరాశ్రయులు కావడంతో మానవత స్వచ్ఛంద సంస్థ శనివారం ఆ కుటుంబానికి బియ్యం, నిత్యావసరాలను ఉచితంగా అందించి తమ ఔదార్యాన్ని చాటింది. సాయిరాం క్లాత్‌షోరూమ్ అధినేత పున్నం గోపి ఆ కుటుంబ సభ్యులకు నూతన వస్త్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గుడివాడ సీతారామాంజనేయులు, జిల్లా కోశాధికారి పసుపులేటి సాంబశివరావు, గ్రామ కన్వీనర్ మాగంటి సూరిబాబు, మానవత సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రకృతిని పరిరక్షించాలి

దెందులూరు: సమస్త ప్రాణకోటికి జీవనాధారమైన ప్రకృతిని మనం పరిరక్షించకపోతే అనేక వ్యాధులు వ్యాపిస్తాయని కళాశాల సీనియర్ స్టూడెంట్ అన్నారు.శనివారం కళాశాలలో హెపటైటిస్– బీపై అవగాహన కల్పించారు. కళాశాల కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

దేశం గర్వించదగ్గ మేధావి కలాం


భీమడోలులో అబ్దుల్ కలాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఫొటోగ్రాఫర్ల సంఘ నేతలు

భీమడోలు: దేశం గర్వించదగ్గ మేధావి, భారతరత్న, మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా, మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. భీమడోలు సర్కిల్ ఫొటో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భీమడోలు సంతమార్కెట్ వద్ద అబ్దుల్ కలాం 9వ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో గ్రంధపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కలాం చిత్రపటానికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్, విద్యార్థులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కలలు కనండి, వాటిని సాకారం చేసుకోండి అనే కలాం నినాదాన్ని ప్రతి ఒక్కరూ ఆచరిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు ద్రాక్షారపు విశ్వనాథం, జిల్లా కోశాధికారి పీవీఆర్ మూర్తి, నాయకులు ఏపీ రంగారావు, నరేష్, వెంకటేశ్వరరావు, శ్రీను, కృష్ణ, ప్రభు చౌదరి, వివిధ పాఠశాలల చిన్నారులు పాల్గొన్నారు.

డెంగీ జ్వరాలపై అవగాహన ర్యాలీ


పూళ్లలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది


భీమడోలు: డెంగీ జ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత వైద్య ఆరోగ్య సిబ్బందిపై ఉందని పూళ్ల పీహెచ్‌సీ వైద్యుడు కల్యాణ్ మహేశ్వరి, డాక్టర్ అరుణ జ్యోతి అన్నారు. పూళ్ల గ్రామంలో శనివారం డెంగీ వ్యతిరేక మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ, ప్రదర్శన నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు కల్యాణ్ మహేశ్వరి, అరుణజ్యోతి మాట్లాడుతూ డెంగీ, టైఫాయిడ్, నీళ్ల విరేచనాలు, కారమెర్ల తదితర వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతలను పాటించేలా పీహెచ్‌సీ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. వారానికి ఒకరోజు శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ మలేరియా అధికారి జే.గోవిందరావు, ఎంపీహెచ్ఈవో కిషోర్, సూపర్‌వైజర్లు జి.శ్రీనివాస్, పీహెచ్ఎన్ అనురాధ, హెల్త్ అసిస్టెంట్లు, , ఎంఎల్‌హెచ్‌పీ, ఎఎన్ఎంలు, పీహెచ్‌సీ సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణతో జీవితానికి భరోసా


హెల్మెట్ ధారణపై అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ నిర్మలాకుమారి

గణపవరం: హెల్మెట్ ధరిస్తే జీవితానికి రక్షణ కవచంలా పనిచేస్తుందని, ప్రతి వాహనదారుడూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి అన్నారు. శనివారం గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు హెల్మెట్ ధారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మలకుమారి మాట్లాడుతూ హెల్మెట్ ధరించని వాహనదారులు రోడ్డు ప్రమాదాల్లో అధికంగా మృత్యువాత పడుతున్నారని అన్నారు. ముఖ్యంగా యువత ద్విచక్ర వాహనాలపై రకరకాల విన్యాసాలు చేసి ప్రాణాలమీదికి తెచ్చుకుంటున్నారని, యువత ఇలాంటి పోకడలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు హెల్మెట్ ధరించాలని నినాదాలు, చేస్తూ ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏ కోఆర్డినేటర్ చైతన్య, స్వరూపరాణి, ఎన్ఎస్ఎస్ 1,2 ప్రోగ్రామ్ ఆఫీసర్లు వెంకటరమణ, భాస్కరరావు అధ్యాపకులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యవర్గం ఎన్నిక


భీమడోలులో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు బి.అంజనేయులు

భీమడోలు: విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం కృషి చేస్తుందని జిల్లా అధ్యక్షుడు బి.ఆంజనేయులు అన్నారు. భీమడోలు రిటైర్డ్ ఉద్యోగుల విశ్రాంతి భవనంలో శనివారం భీమడోలు యూనిట్ అధ్యక్షుడు, కార్యవర్గం ఎన్నిక జిల్లా ప్రతినిధుల బృందం బి.ఆంజనేయులు, కె.మహాలక్ష్మీ, డి.గంగాధరరావు సమక్షంలో ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా యూనిట్ అధ్యక్షుడు పంచకర్ల సత్యనారాయణ, అసోసియేటెడ్ అధ్యక్షుడుగా ఎంసీ కోటయ్య, కార్యవర్గ సభ్యులుగా ఎస్.పరదేశిరావు, వైఆర్‌కే శర్మ, వసంతరావు, వెంకట్రావు, రామారావు తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నిర్వహించిన సమావేశానికి యూనిట్ అధ్యక్షుడు పంచకర్ల సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అధ్యక్షుడు బి.ఆంజనేయులు మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగులు సంఘం నియమ నిబంధనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో దోమలను నిర్మూలించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని, ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) ఆదేశాలతో ప్రతి ప్రాంతంలోనూ దోమల నివారణకు ఫాగింగ్, ఆయిల్ బాల్స్ నీటి నిల్వల్లో వేస్తున్నామని ఏలూరు నగర హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మాలతి శనివారం తెలిపారు. ఏలూరు 44వ డివిజన్ రెల్లీస్ పేట, ముస్లింపేట, డాక్టర్ ప్రసాద్ గారివీధి, గన్‌బజార్ మెయిన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో మురుగునీటి కాలువల్లో, కల్వర్టుల కింద ఫాగింగ్ చేశారు. ఖాళీ స్థలాలు, నీటి నిల్వలు ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేశారు. మలేరియా ఇన్‌స్పెక్టర్ దత్తి వేణుగోపాల్‌స్వామి, సూపర్‌వైజర్ దుర్గారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ ఉన్నారు.

క్లుప్తంగా

బాల్య వివాహాలు నేరం


గణపవరంలో బాల్య వివాహాలతో కలిగే అనర్థాలను వివరిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

గణపవరం: బాల్యవివాహాలు నేరమని, వీటిని ప్రోత్సహించేవారు ఏడేళ్ల కారాగార శిక్షకు గురవుతారని గణపవరం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తులసి అన్నారు. శనివారం గణపవరం బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు బాల్యవివాహాల చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికల సంరక్షణ కోసం ప్రభుత్వాలు ఎన్నో చట్టాలను అమలు చేస్తున్నాయని, వీటిపై బాలికలు అవగాహన కలిగి ఉండాలని, తమ హక్కుల సాధనకు ఈ చట్టాలు దోహద పడతాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో కలిసి బాల్యవివాహాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

గణపవరం(ఉంగుటూరు): ఉంగుటూరు మండలం బాదంపూడి వై జంక్షన్ వద్ద ప్రైవేటు బస్, కారు ఢీకొన్న ప్రమాదంలో నలుగురు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ నుంచి యానాం వెళ్తున్న ప్రైవేటు బసస్సు, వాడపల్లి నుంచి విజయవాడ వెళ్తున్న టాక్సీ వై జంక్షన్ వద్ద ఎదురెదురుగా ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

డీఎస్సీ-98 ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని వినతి

దెందులూరు: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా డీఎస్సీ-98 బ్యాచ్‌కు చెందిన 4,534 మందిని ఉపాధ్యాయులుగా నియమించారని వారందరినీ మానవతా దృక్పథంతో క్రమబద్ధీకరించాలని రాష్ట్ర అసోసియేషన్ సభ్యులు ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి శ్రీనివాస్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఏలూరు జిల్లా అధ్యక్షుడు తోట ఎడ్వర్డ్, రమణ, కృష్ణారెడ్డి, భానుమూర్తి, రాజేంద్ర శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఈ అంశంపై వినతిపత్రం అందజేశారు. పరిశీలించి చర్యలు తీసుకుంటానని సీఎం అన్నారని రాష్ట్ర యూనియన్ కమిటీ సభ్యులు తెలిపారు.

ఏపీపీ రాజేంద్రప్రసాద్‌కు వీడ్కోలు సత్కారం

ఏలూరు (టూటౌన్): ఈ నెలాఖరుతో తన టెన్యూర్‌ను పూర్తి చేసుకుంటున్న సెకండ్ ఏడీజే కోర్టు ఏపీపీ సీహెచ్ రాజేంద్రప్రసాద్‌కు శనివారం వీడ్కోలు సత్కారం చేశారు. జాయింట్ డైరెక్టర్స్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ లాం అజయ్, లాం సుబ్బలక్ష్మి చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించారు. దానిలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా సీహెచ్ రాజేంద్రప్రసాద్‌తో పాటు మరొక ఏపీపీల మూడేళ్ల పదవీ కాలం జూలై నెలాఖరుతో ముగియనుండటంతో వారిని ఘనంగా సత్కరించారు. ఏలూరులో నిర్వహించిన కార్యక్రమంలో డీటీపీ రామకోటేశ్వరరావు, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ లక్ష్మణ్‌నాయక్, ఏపీపీలు డీవీ రామాంజనేయులు, ఆచంట వెంకటేశ్వరరావు, పలువురు ఏపీపీలు, న్యాయవాదులు పాల్గొన్నారు.

28 నుంచి కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసనలు

ఏలూరు (టూటౌన్): కేంద్ర మోదీ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా సమావేశం డిమాండ్ చేసింది. స్థానిక పవరుపేటలోని అన్నే భవన్‌లో సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా సమావేశం శనివారం నిర్వహించారు. ఆగస్టు 9న కార్పొరేట్స్ క్విట్ ఇండియా డే నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని సమావేశం పిలుపునిచ్చింది. ఈ సమావేశంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు పి.పెంటయ్య, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు మాట్లాడారు. జూలై 28, 29 తేదీల్లో కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా, ఆగస్టు 9న క్విట్ ఇండియా డే సందర్భంగా కార్పొరేట్ క్విట్ ఇండియా నినాదంతో ఆందోళనలు నిర్వహిస్తామన్నారు.

సంరక్షణ కేంద్రానికి బాలుడు

ఏలూరు టౌన్: ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్‌లో ఒక బాలుడు ఒంటరిగా ఫ్లాట్‌ఫామ్‌పై తిరుగుతూ ఉండగా ఏలూరు రైల్వే ఎస్సై పి.సైమన్ గుర్తించారు. బాలుడిని వివరాలను ఆరాతీయగా తాను నాంథేడ్ ప్రాంతం నుంచి వచ్చి ద్వారకాతిరుమల వేద పాఠశాలలో వేద విద్యనభ్యసిస్తున్నట్లు తెలిపాడు. తన పేరు పతకీ మయూర్ గజానంద్‌గా తెలిపిన బాలుడు తనకు వేద పాఠశాలలో ఉండేందుకు ఇష్టం లేక పారిపోయి వచ్చినట్టు తెలిపాడు. రైల్వే ఎస్సై సైమన్ బాలుడి నుంచి వివరాలు తెలుసుకుని వేద పాఠశాల యాజమాన్యానికి, బాలుడి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ఏలూరు జిల్లా చైల్డ్‌లైన్ అధికారుల సమక్షంలో బాలుడు సురక్షితంగా ఉండేందుకు సంరక్షణ కేంద్రానికి అప్పగించామని రైల్వే ఎస్సై తెలిపారు.